సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 12 । ఆగస్టు । 2024



నత్తనడకన 'ప్రసాద్' పనులు

భద్రాచలం, పర్ణశాల రామాలయాల్లో ప్రభుత్వాలు చేపట్టిన ప్రసాద్ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. 8లో



'గంజాయి' శిక్షలు కఠినంగా..

గంజాయి కేసు నమోదైతే నూతన చట్టాలతో శిక్షలు కఠినంగా ఉంటాయని డీఎస్పీ ఎస్.చంద్రభాను హెచ్చరించారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి చిత్రకూట మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు.

మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా బూర్గుల



నియామకపత్రం అందుకుంటున్న విజయ్‌భాస్కర్

పాల్వంచ: మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా బూర్గుల విజయ్‌భాస్కర్ నియమితులయ్యారు. పాల్వంచ కేటీపీఎస్ ఉద్యోగి అయిన విజయ్‌భాస్కర్ రెండోసారి ఈ పదవికి ఎంపిక కాగా ఆదివారం ఢిల్లీలో ఆయనకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే, సంఘం సలహాదారులుగా బూర్గుల వెంకటేశ్వర్లు, మన్నే శ్రీధర్‌రావు, లీగల్ అడ్వైజర్‌గా జి.రమేష్‌ను నియమించారు.

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

26 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్‌లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో ఉన్న వజ్రాల గుట్టపై 26 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, చిలక రాజయ్య, గౌతమ్, అనూక్ రాజ్, డాక్టర్ రాము, ఈశ్వర్, కుమార్, ఆరే నాగభూషణం, రాహుల్, అముదాల శివ, బండ వెంకట్, శివ, టైలర్ చోటి, రామ్ సందీప్, దీపు, విశాల్, సాగర్, జునైద్, దినేష్, చందు, లడ్డు, మణికంఠ, రంజీత్, శశాంక్, వికాస్, కోరి పాల్గొన్నారు.



ఆవిష్కరించిన జాతీయ పతాకం

పర్యాటకంపై పట్టింపేది..?



ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తికాని హరిత హోటల్

జిల్లాలో టూరిజం అభివృద్ధికి అవకాశాలు మెండు

- కిన్నెరసానితోపాటు పర్ణశాల, భద్రాచలం వంటి పుణ్యతీర్థాలు
- తెలంగాణ వచ్చాక ప్రతిపాదనలు రూపొందించినా పనుల్లో జాప్యం
- అసంపూర్తిగా ఆగిపోయిన కాటేజీల నిర్మాణం
- నేడు పర్యాటక శాఖ మంత్రి రాక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అవకాశాలు ఉన్నా జిల్లాలో పర్యాటక అభివృద్ధి ముందుకు సాగడంలేదు. ప్రకృతి అందాలతో మైమరిపించే కిన్నెరసాని, భద్రాచలం, పర్ణశాల పుణ్యతీర్థాలు కొలువైన నేపథ్యంలో టెంపుల్, ఎకో, ఇండస్ట్రియల్, వాటర్ టూరిజం అభివృద్ధి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలనకు నేడు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

అద్దాలమేడ అధోగతి

కిన్నెరసాని డ్యామ్ నిర్మాణం తర్వాత సింగరేణి సహకారంతో బ్యాక్‌వాటర్ సమీపంలో 1980వ దశకంలో కాటేజీని నిర్మించారు. అద్దాలమేడగా ప్రసిద్ధి చెందిన ఈ కాటేజీని నక్సల్స్ పేల్చివేశారు. అప్పటి నుంచి కిన్నెరసానిలో పర్యటకులకు కాటేజీలు అందుబాటులో లేకుండా పోయాయి. తెలంగాణ ఏర్పడ్డాక 2015లో అద్దాలమేడతోపాటు తొమ్మిది కాటేజీలు, ఒక ఫుడ్ కోర్టు నిర్మాణ మొదలయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.10.74 లక్షలు మంజూరు చేశారు. కానీ ఇంతవరకు ఒక్క కాటేజీ కూడా పర్యాటకులకు అందుబాటులోకి రాలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 అక్టోబరులో అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కాటేజీలు హడావుడిగా ప్రారంభించారు. అయితే సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులకు వీటిని అందుబాటులోకి తేలేదు. ఇక ఫుడ్‌కోర్టు నిర్మాణమయితే అతీగతీ లేకుండా పోయింది.

నత్తనడకన హరిత హోటల్ పనులు

భద్రాచలం వచ్చే రామభక్తులతో పాటు జిల్లా కేంద్రంగా మారిన కొత్తగూడెం ప్రజలకు ఉపయోగపడేలా రూ.15 కోట్లతో ఇల్లెందు క్రాస్‌రోడ్ దగ్గర హరిత హోటల్, కాటేజీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులు మొదలై ఏడేళ్లయినా నేటికి కొలిక్కి రాలేదు. ఫర్నీచర్, నీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తే అందుబాటులోకి వచ్చే దశలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గడిచిన మూడు నెలలుగా ఇక్కడ కొంత పని జరుగుతున్నా అది అంతర్గత రోడ్ల నిర్మాణానికే పరిమితమైంది. ఈ హోటల్‌కు పక్కనే సుమారు నాలుగు వందల ఎకరాల విస్తీర్ణంలో చల్లమల్ల శ్రీనివాసరావు సెంట్రల్ పార్కు ఇటు ఎకో టూరిజం, అటు అడ్వెంచర్ టూరిజానికి అనువుగా ఉంది. అయితే ఈ మేరకు కొన్ని మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

రివర్ వ్యూ కాటేజీలు

సీతారాముల ఆలయంతోపాటు పాపికొండలు, మారేడుమిల్లి, సీలేరు వంటి పర్యాటక ప్రాంతాలకు భద్రాచలం గేట్‌వేగా ఉంది. ఇటు భక్తులు, అటు పర్యాటకుల నుంచి డిమాండ్ ఉంది. అయినప్పటికీ పర్యాటక శాఖ నుంచి కొత్తగా ఎటువంటి ప్రణాళిక లేదు. రెండు దశాబ్దాల కిందట కట్టిన హరిత హోటల్ ఒక్కటే ప్రధాన దిక్కుగా ఉంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో భద్రాచలంలో తలెత్తిన స్థల లభ్యత కొరతను దృష్టిలో ఉంచుకుని నదీ తీరం భద్రాచలం వైపు కరకట్ట, బూర్గంపాడు/సారపాకల వైపు రివర్‌వ్యూ కాటేజీలు నిర్మించాలనే డిమాండ్ ఉంది. రాబోయే రోజుల్లో గోదావరిపై సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయితే ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందేందుకు పర్ణశాలకు ఎంతో అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ రివర్ వ్యూ కాటేజీలు లేదా హోటల్‌ను పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మించాలనే డిమాండ్ ఉంది.

రథంగుట్టలు

ఇటు భద్రాచలం సర్క్యూట్, అటు కాకతీయ సర్క్యూట్‌లకు అనుసంధానంగా మణుగూరు దగ్గర రథం గుట్టలు ఉంటాయనే ఆలోచనతో ఇక్కడ ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రథంగుట్టలపై దాదాపు ఏడు ఎకరాల స్థలం అందుబాటులో ఉండగా, రివర్‌వ్యూ ఫ్రంట్ పేరుతో కాటేజీల నిర్మాణానికి పరిశీలన చేశారు. అయితే ఆ తర్వాత ఎటువంటి పురోగతి లేదు.

అదనపు ఆకర్షణలు

శ్రీరామనవమి, ముక్కోటి, హనుమాన్‌జయంతి వంటి పర్వదినాల్లో భద్రాచలానికి వచ్చే భక్తులకు వసతి ఇబ్బందిగా మారుతోంది. భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచలలో ఉండే ప్రైవేటు లాడ్జీల్లో కూడా గదులు లభించని పరిస్థితి నెలకొంటోంది. ఈ సమస్యకు పరిష్కారంగా భక్తుల రద్దీ ఉండే రోజుల్లో కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచలలో ఉన్న సింగరేణి, కేటీపీఎస్‌లకు సంబంధించిన గెస్ట్ హౌస్‌లను భక్తులకు అద్దె ప్రతిపాదికన అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. దీంతో పాటు భద్రాచల ప్రధాన ఆలయం తూర్పు మెట్ల మార్గం పక్క నుంచి కరకట్టలో స్నానఘట్టాల వరకు తీగల వంతెన నిర్మాణం చేయాలని భక్తులు కోరుతున్నారు. తీగల వంతెన నిర్మాణం కారణంగా భద్రాచలానికి సరికొత్త ఆకర్షణ తోడవటమే కాకుండా భక్తులు సులువుగా నదీ తీరానికి చేరుకునేందుకు వీలవుతుంది. అంతేకాకుండా ఇండస్ట్రియల్ టూరిజంలో భాగంగా ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెంలలో పరిశ్రమల సందర్శన ప్యాకేజీలు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

అటకెక్కిన ఆనంద ద్వీపం

కిన్నెరసాని డ్యామ్ బ్యాక్ వాటర్‌లో ఉన్న ద్వీపం ఆధారంగా చేసుకుని కశ్మీర్‌లో దాల్ లేక్ తరహాలో బోట్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ఆనంద ద్వీపం పేరుతో గతంలో ప్రణాళిక రూపొందించారు. ద్వీపంలో కాటేజీలు, ఎంటర్‌టైన్‌మెంట్ థీమ్ పార్కులు అభివృద్ధి చేయడంతోపాటు బోట్‌హౌజ్‌లను ఇక్కడ అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. అయితే ఆ తర్వాత ఈ ప్రణాళిక పూర్తిగా అటకెక్కింది.



నిలిచిపోయిన ఫుడ్‌కోర్టు నిర్మాణ పనులు

బీజీ కొత్తూరు పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరులో ఉన్న సీతారామ ప్రాజెక్ట్‌కు చెందిన ఒకటో పంప్‌హౌస్ నుంచి ఆదివారం ఒక మోటారు ద్వారా నీరు విడుదల చేశారు. పూసుగూడెం, కమలాపురం పంప్‌హౌస్‌ల్లో ట్రయల్ రన్ ఉండటంతో మొదటి పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల చేపట్టారు. ఒక మోటారు నుంచి 1,500 క్యూసెక్కుల చొప్పున 7 గంటలపాటు నీటిని ఎత్తిపోశారు. దీంతో కాలువలో గోదావరి జలాలు పరవళ్లు తొక్కాయి.



పంప్‌హౌస్–2 ట్రయల్‌రన్ సక్సెస్

- మొరాయించిన మూడో పంప్‌హౌస్ మోటార్లు?
- కమలాపురం వద్ద సమీక్ష జరిపి వైరా వెళ్లిన మంత్రులు



ములకలపల్లి : పూసుగూడెం పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతాక కాల్వలో ప్రవహిస్తున్న గోదావరి జలాలు

అశ్వారావుపేట/ములకలపల్లి: ములకలపల్లి మండలం పూసుగూడెం శివారులో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్–2 ట్రయల్‌రన్ విజయవంతమైంది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెలికాప్టర్‌లో నేరుగా ఆదివారం ఉదయం 11 గంటలకు పంప్‌హౌస్–2 వద్దకు చేరుకున్నారు. అంతకుముందే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్కడికి వచ్చారు. నీటిపారుదలశాఖ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు కూడా చేరుకున్నారు. ప్రధాన కాలువలోని నీటి నిల్వలను పరిశీలించి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇతర మంత్రులతో కలసి 11.20 గంటల సమయంలో మోటారు స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. గోదావరి జలాలను ఎత్తిపోయగా, పూలు జల్లి హర్షం వ్యక్తం చేశారు. కాగా సుమారు ఎనిమిదేళ్లుగా సాగుతున్న సీతారామ ప్రాజెక్ట్ పనులు చివరి అంకానికి చేరుకుంది. మంత్రులు ట్రయల్ రన్ నిర్వహించడంతో గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు పరుగులెత్తింది. గోదావరి జలాలు తొలిసారిగా ములకలపల్లి మండలంలోని పూసుగూడెం పంప్‌హౌస్ నుంచి కమలాపురం పంప్‌హౌస్–3 వైపు సాగడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. నీటిపారుదలశాఖ ముఖ్య సలహాదారు పెంటారెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో మూడో పంపుహౌస్ ట్రయల్‌రన్ వాయిదా..?

సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ఈ నెల 15న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఆదివారం పూసుగూడెంవద్ద ఉన్న రెండో పంపుహౌస్ ట్రయల్ రన్ విజయవంతమైంది.



ఎత్తిపోతలను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, కలెక్టర్ జితేష్, అధికారులు

అనంతరం మంత్రులు మధ్యాహ్నం 12.30 గంటలకు పూసుగూడెం నుంచి హెలికాప్టర్‌లో కమలాపురం చేరుకున్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి, మూడో పంప్‌హౌస్ ట్రయల్‌రన్ నిర్వహించకుండానే వైరా వెళ్లిపోయారు. సాంకేతిక కారణాలతో ట్రయల్‌రన్ నిర్వహించలేదని సమాచారం. కాగా మోటార్లను సరఫరా చేసిన చైనా కంపెనీ సిబ్బంది మోటార్లు కమిషనింగ్‌కు రాలేదని, పంపులు మొరాయించడంతో ట్రయల్ రన్ వాయిదా వేశారని ప్రచారం జరుగుతోంది. పూసుగూడెం పంప్‌హౌస్ వద్ద మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ కమలాపురం పంప్ హౌస్ ఈరోజు కాకుంటే రేపు ట్రయల్‌రన్ నిర్వహిస్తారని పేర్కొనడం గమనార్హం. ముఖ్యమంత్రి పథకాన్ని ప్రారంభించే లోగా పంప్‌హౌస్‌ను ట్రయల్ రన్ చేస్తారా? లేదా అనే విషయంలో స్పష్టత లేదు.

రైతులను అనుమతించని పోలీసులు

ముగ్గురు మంత్రుల రాకతో ఎస్పీ రోహిత్‌రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కమలాపురం పంప్‌హౌస్–3 సమీపంలో ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు కరుణాకర్, ఇంద్రసేనారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. పంప్‌హౌస్ వద్దకు స్థానిక రైతులను, పలు పార్టీల నాయకులతోపాటు మీడియాను సైతం అనుమతించలేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ గొల్ల పెంటయ్య, గొల్ల నారాయణ, కల్తి పాపయ్య తదితర రైతులు మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం భూములను కోల్పోయిన తమను మంత్రులను కలవకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, నాగళ్ల వెంకటేశ్వరరావు, పర్వతనేని అమర్‌నాథ్, గాడి తిరుపతిరెడ్డి, అడపా నాగేశ్వరరావు, బాల అప్పారావు గద్దె రమేశ్, కుంజా రామ్మూర్తిచ గుద్దూరి నర్సింహారావు తదితరులు ఉన్నారు.

■ నీటి కుంటలా పెదవాగు ప్రాజెక్ట్



ప్రస్తుతం నీటి కుంటను తలపిస్తున్న ప్రాజెక్ట్

అన్నదాతల జీవనాడి.. పంట పొలాలకు సాగు నీరు అందించే పెదవాగు ప్రాజెక్ట్ నీటి కుంటలా మారిపోయింది. గత నెల 18న రాత్రి కురిసిన భారీ వర్షాలు, వరదలతో అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్దగల ప్రాజెక్ట్ కట్టకు భారీ గండ్లు పడిన సంగతి తెలిసిందే. దీంతో సాగు నీరంతా గోదావరి పాలై ప్రాజెక్టు ఖాళీగా దర్శనమిస్తోంది. జలాశయంలో పడమర దిక్కులో గుంత ఉండగా, దాంట్లో కొద్దిపాటి వరదనీరు నిలిచి నీటి కుంటలా మారిపోయింది. ఆదివారం కనిపించిన దృశ్యమిది. –అశ్వారావుపేటరూరల్



జలకళతో పెదవాగు ప్రాజెక్ట్(ఫైల్)

సాగునీటి రంగాన్ని విధ్వంసం చేశారు..

గత ప్రభుత్వంపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఫైర్

వైరా: ఉమ్మడి జిల్లా ప్రజల కలల ప్రాజెక్టు అయిన 'సీతారామ'ను దివంగత సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా రూ.2 వేల కోట్ల అంచనాలతో ప్రారంభించారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అయితే, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంచనాలు పెంచినా ఒక్క ఎకరాకూ నీరు ఇవ్వకపోగా సాగునీటి రంగాన్ని విధ్వంసం చేశారని మండిపడ్డారు. వైరాలో ఈనెల 15న జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభ ఏర్పాట్లను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ వైఎస్ హయాంలో రూపొందించిన ప్రాజెక్టు అంచనాలను గత ప్రభుత్వం రీడిజైన్ పేరుతో రూ.18 వేల కోట్లు పెంచి రూ.8 వేల కోట్లు వెచ్చించినా ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని తెలిపారు. అయితే, తాము అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన సీతారామ ప్రాజెక్టు నీటిని రాజీవ్ కెనాల్ ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు 1.75 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు.

పంద్రాగస్టు చరిత్రాత్మకం

సీఎం రేవంత్‌రెడ్డి వైరా పర్యటన సందర్భంగా ఈనెల 15వ తేదీ ప్రజలకు చరిత్రాత్మకంగా నిలిచిపోనుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అదేరోజు గోదావరి జలాలు విడుదల చేయడమేకాక రూ.2 లక్షల రుణమాఫీ చేస్తారని చెప్పారు. సీతారామ ప్రాజెక్టును తమ కీలకంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టు ప్రధాన 14వ కి.మీ. వరకు 1 నుండి 8వ ప్యాకేజిల్లో పనులు పూర్తికాగా.. 9.85 కి.మీ. మార్లెపాడు ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక నియోజకవర్గంలో 15,795 ఎకరాలకు సాగు నీరు అందుతుందని చెప్పారు.

పల్లెల్లో బోనాల సందడి

శ్రావణమాసం తొలిఆదివారం సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల్లో బోనాల సందడి నెలకొంది. మహిళలు బోనమెత్తుకుని డోలు వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు.



పాల్వంచరూరల్: పాండురంగాపురంలో బోనాలతో బయల్దేరిన భక్తులు 9లో

చరిత్రాత్మకం.. గోదావరి నీళ్ల ఎత్తిపోతలు

- సీతారామ ప్రాజెక్ట్ పూర్తికి ఎంత ఖర్చయినా పెడతాం
- రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి నీళ్లు ఎత్తిపోసిన ఈ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లా చరిత్రలో చరిత్రాత్మక దినమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ములకలపల్లి మండలం పూసుగూడెం పంప్‌హౌస్–2లో ట్రయల్ రన్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2026 ఆగస్టు 16 నాటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా నిర్దేశించిన ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఎంత ఖర్చయినా వెనుకాడబోమని తెలిపారు. ఇందుకోసం అవసరమైన వేల ఎకరాల భూమిని యుద్ధ ప్రాతిపదికన సేకరిస్తామన్నారు. డిస్ట్రిబ్యూటరీ కెనల్ పనులు పక్కాగా పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నాగార్జున సాగర్ కెనాల్‌కు గోదావరి నీరు అందించే వీలు కలుగుతుందని, తద్వారా 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించవచ్చని వివరించారు.

డిస్ట్రిబ్యూటరీ కాల్వ పనులు ప్రారంభించాలి : తుమ్మల

ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన 106 కి.మీ ప్రధాన కాలువ వెంబడి అనువుగా ఉన్న చోట డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. జూలూరుపాడు, యాతాలకుంట (సత్తుపల్లి ట్రంక్ కెనాల్), పాలేరు టన్నెళ్ల నిర్మాణంతో పాటు ఫారెస్టు అనుమతులు కారణంగా ప్రధాన కాలువ పనులు మరికొంత కాలం కొనసాగుతాయన్నారు. అప్పటి వరకు ప్రధాన కాలువ వెంబడి 9.8 కి.మీ (మార్లెపాడు), 74 కి.మీ, 74 నుంచి 98 కి.మీల మధ్యన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మిస్తే 90 వేల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. ఇందుకోసం రూ.1,050 కోట్ల నిధులు, 3021 ఎకరాల భూసేకరణ అవసరం అవుతుందన్నారు. ఈ పనులు వెంటనే చేపట్టాలని తుమ్మల సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నీటి పారుదుల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్, కొత్తగూడెం, భద్రాచలం ఎస్‌ఈలు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం, ఇల్లెందుకు కూడా నీళ్లు : పొంగులేటి

సీతారామ ప్రాజెక్టు పూర్తయితే పినపాక, కొత్తగూడెం, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గోదావరి నీరు అందుకోలేకపోతున్న భద్రాచలం, ఇల్లెందు నియోజకవర్గాల కోసం అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ముందుగా సీతారామను ఇల్లెందు నియోజకవర్గంలో రోళ్లపాడు దగ్గర ప్రారంభించినా ఆ తర్వాత అది రద్దయిందన్నారు. జూలూరుపాడు టన్నెల్, కెనాల్ పూర్తయితే ఇల్లెందుకు నీరు అందివ్వడం సాధ్యం అవుతుందన్నారు. ప్రధాన కాలువ నిర్మాణంతోనే సరిపోదని, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు త్వరగా పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి నీరు ఇవ్వాలన్నారు.

క్లుప్తంగా

డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లుకు నియామకపత్రం ఇస్తున్న ఎన్నికల అధికారులు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కురవగడ్డ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు ఎండీ జహంగీర్, యు.వెంకటయ్య, ఎండీ సాబీబ్, ఇబ్రహీం ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా వెంకటేశ్వర్లు, బి.రామారావుగౌడ్ నామినేషన్లు వేశారు. అయితే, పరిశీలన జరిపిన అనంతరం రామారావు నామినేషన్‌ను తిరస్కరించడంతో వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న ఆయన్ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బి.రామారావు, దాసరి వేణుగోపాల్, ఎల్.గంగన్న, జి.రాములు, ప్రసాద్, బానోత్ హరిసింగ్, జి.నాగరాజు, వనమా శ్రీనివాసరావు, రాఘవులు, వి.నాగరాజు, భిక్షం, హుస్సేన్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు నోటీస్, డిప్యూటీ వార్డెన్ సస్పెన్షన్

విద్యార్థి మృతికి కారకులపై చర్యలు

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి గిరిజన సంక్షేమ శాఖ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కుంజా దీపక్ మృతికి కారకులుగా భావిస్తూ ఇద్దరిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలంలోని బండారుగూడేనికి చెందిన దీపక్ కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో చదువుతూ రెండు రోజులు సెలవులు రావడంతో స్వగ్రామానికి శనివారం ఆటోలో బయలుదేరాడు. మార్గంమధ్యలో ఆటోను కారు ఢీకొనగా మృతి చెందాడు. ఈ నేపథ్యాన విధుల్లో అలసత్వం వహించారంటూ పీఓ ఆదేశాలతో హెచ్‌ఎం నర్సింహారావుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. డిప్యూటీ వార్డెన్ హరికృష్ణను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి..


మాట్లాడుతున్న కాంపాటి పృథ్వీ

భద్రాచలంఅర్బన్: దుమ్ముగూడెం మండలంలోని కొత్తపల్లి బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతన్న కుంజా దీపక్ మరణానికి కారణమైన వారిని వదిలేసి ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంకు సహాయకుడిగా ఉన్న వార్డెన్‌పై చర్యలు తీసుకొని ఐటీడీఏ అధికారులు చేతులు దులుపుకున్నారని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగల శివప్రశాంత్ ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారులు అలసత్వంతో ఉండటంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వార్డెన్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా విద్యార్థి మరణానికి కారణమైనవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గట్టుపల్లి తులసీరామ్, అల్లం సంజు, ఇర్ప నాగేంద్ర, తెల్లం శరత్, వాసం దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల బాలుడు మృతి

పసరు మందు తాగించడంతో ఘటన

పాల్వంచ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న మూడు నెలల బాలుడికి తెలిసీ తెలియక పసరు మందు తాగించడంతో మృతి చెందిన ఘటన ఇది. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం దంతలబోర గ్రామపంచాయతీ పరిధి కోయగట్టు గ్రామానికి చెందిన ఆదివాసీలైన పద్దం వీరభద్రం – పమ్మిడి దంపతుల మూడు నెలల కుమారుడికి ఆదివారం తీవ్రంగా ఆయాసం వచ్చింది. దీంతో తల్లిదండ్రులు తమకు తెలిసిన మేరకు పసరు మందు తాగించారు. ఆ కాసేపటికే బాలుడి పరిస్థితి విషమంగా మారడంతో 108 వాహనంలో పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందాడని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతూ సొమ్మసిల్లి పడిపోయారు.

హైవే పనులను అడ్డుకున్న గ్రామస్తులు

నేలకొండపల్లి: కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి నిర్మాణ పనులను మండలంలోని పైనంపల్లి వద్ద గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలో సైడ్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టలేదని, గ్రామంలోకి రాకపోకలు సాగించేలా పనులు చేయలేద ని ఆరోపిస్తూ ఆదివారం వారు నిరసన తెలిపా రు. ఖమ్మం–కోదాడ రహదారిపై రాస్తారోకో నిర్వహించగా కంపెనీ ప్రతినిధులు చేరుకుని చర్చించారు. నేషనల్ హైవే అధికారులు రావాల్సిందేనని చెప్పడంతో త్వరలో సమస్యలు పరిష్కరిస్తామన్న ప్రతి నిధుల హామీతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కె.సామేల్, యడవల్లి నాగరాజు, షేక్ హుస్సేన్, గోవర్దన్, కుక్కల ఇస్సాక్, యడవల్లి తిరపయ్య, ఉమాచారి, కోడి రామనర్సయ్య, యడవల్లి రాంబాబు, ఆవుల రామయ్య, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన 'ప్రసాద్' పనులు

- గడువు ముగిసినా ఇంకా పునాదుల్లోనే..
- ఇంకెన్ని రోజులు పడుతుందో కూడా చెప్పలేని దుస్థితి
- నేడు జిల్లాలో పర్యటించనున్న మంత్రులు


రెండో బ్రిడ్జి ప్రక్క 1.20 ఎకరాల స్థలంలో ఆగిపోయిన పనులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం, పర్ణశాల అనుబంధ ఆలయంలో కేంద్ర ప్రభుత్వం, పర్యాటక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ ఆగ్‌మెంటేషన్ డ్రైవ్ – ప్రసాద్' పథకం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. పనులు పూర్తి చేయాల్సిన గడువు ముగిసినా ఇంకా పునాదులను దాటలేని దీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇంకెన్ని సంవత్సరాలు పడుతుందో కూడా ఆయా సంబంధిత శాఖలు చెప్పలేని స్థితిలో 'ప్రసాద్' ఉండటంతో భక్తుల్లో నిరాశ నెలకొంది. దేశ ప్రథ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము స్వయంగా భద్రాచలంలో ప్రారంభించిన వసతి భవన నిర్మాణ పనులే నత్తనడకన నడుస్తుండటంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా మిథిలా స్టేడియం వెనుక వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించే రెండు ఎకరాల స్థలంలో జీ ప్లస్–2లో యాత్రికులకు గదులు, వ్రత మండపం, బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న 1.20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో మరో వసతి గదుల భవనం, పర్ణశాలలో మరో భవనానికి సంబంధించిన పనులు గతేడాది మేలో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జూలై 30వ తేదీ నాటికి ఈ మూడింటిని పూర్తి చేసి టూరిజం శాఖకు అప్పగించాల్సి ఉంది. పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేయలేదు. భద్రాచలంలో రెండు చోట్ల పనులు పునాదుల వద్దనే నిలిచాయి. ఇక పర్ణశాలలో స్థల వివాదం నెలకొనడంతో మరో చోట స్థలాన్ని కేటాయించి అప్పగించినప్పటికీ అక్కడా పనులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇక ఆలయ ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులు ప్రభుత్వానికి అందించిన మాస్టర్‌ప్లాన్ పూర్తయిన తరువాతే చేపట్టనున్నట్లు సమాచారం.

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర పర్యాటకం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లాలో సోమవారం పర్యటించనున్నారు. నేలకొండపల్లి, ఖమ్మం ఖిలాతో పాటు పాల్వంచ మండలం కిన్నెరసాని పర్యాటక ప్రాంతాలను పరిశీలిస్తారు. ఈ నేపథ్యాన భద్రాచలంలో పనులపైనా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ అలసత్వం..

వర్షాలు, గోదావరి ముంపు, మట్టి దొరకలేదనే కారణాలతో సదరు కాంట్రాక్టర్ పనులు ఆలస్యం చేస్తుండటంతో టూరిజం శాఖ అధికారులు పలుమార్లు నోటీసులు జారీచేశారు. జూలై 30కి పూర్తి కావాల్సి ఉన్నా.. కనీసం ఆగస్టు 15కైనా కొంతమేర పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు గడువు ఇచ్చారు. ఆపై జరిమానాకు సిఫారసు చేశారు. అయినా పనులు ముందుకు సాగనందున అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

పనులు సాగడం లేదు

'ప్రసాద్' పనులను జూలై 30కి పూర్తి చేయాల్సి ఉంది. ఆగస్టు 15 వరకు గడువును పెంచి పనులను వేగం చేయాలని ఆదేశించాం. అయినప్పటికీ నత్త నడకనే నడుస్తున్నాయి. ఇక్కడ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తూనే ఉన్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం.
– నిమ్మల రామకృష్ణ, డీఈ, టూరిజం శాఖ

పర్యాటకానికి నోచుకునేనా?

ప్రతిపాదనల్లోనే దుమ్ముగూడెం ఆనకట్ట అభివృద్ధి


కుమ్మరిగూడెం వద్ద గోదావరిపై దుమ్ముగూడెం ఆనకట్ట

అశ్వాపురం: మండలంలోని కుమ్మరిగూడెం వద్ద గోదావరి నదిపై అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాలను కలుపుతూ 150 ఏళ్ల కిందట 1865లో సర్ అర్థర్ కాటన్ దుమ్ముగూడెం ఆనకట్ట నిర్మించారు. అయితే, ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతుండగా ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ప్రతిపాదనలకే పరిమితమైంది. ఆనకట్ట అందాలను చూడడానికి వివిధ ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. పరిసరాల్లో దట్టమైన అడవి ఉన్నా పర్యాటక రంగంలో అడుగులు పడడం లేదు.

అన్నింటికీ ఆధారం

దుమ్ముగూడెం ఆనకట్ట ఆధారంగా గతంలో కేంద్ర ప్రభుత్వం భారజల కర్మాగారాన్ని నిర్మించింది. ఆనకట్టకు సమీపాన ఇన్ టేక్‌వెల్ ద్వారా కర్మాగారానికి నీరు తరలిస్తారు. అలాగే, కుమ్మరిగూడెం, ప్రస్తుతం పాములపల్లిలో ఎత్తిపోతల పథకాలు నిర్మించగా.. దివంగత వైఎస్‌ఆర్ హయాంలో దుమ్ముగూడెం రాజీవ్‌సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను రీడిజైన్ చేసి సీతారామ ప్రాజెక్ట్‌గా చేపట్టింది. ఈ ఆనకట్ట సమీపాన ఇన్‌టేక్‌వెల్ నుంచే మిషన్ భగీరథ పథకం ద్వారా భద్రాద్రి, ఖమ్మం జిల్లాలోని 22 మండలాల ప్రజలకు తాగునీరందిస్తున్నారు. ఇక్కడే సీతమ్మసాగర్ బ్యారేజీ, జల విద్యుత్ కేంద్రం నిర్మించాలని భావించినా అనుమతులు రాలేదు. బ్యారేజీ పూర్తయితే అశ్వాపురం – దుమ్ముగూడెం మండలాలకు రాకపోకలు సులువవుతాయి. అలాగే, వేసవిలో అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాలకు ఈ ఆనకట్ట వారధిలా పనిచేస్తోంది. వర్షాకాలంలో ఆనకట్టపై నీరు పొంగిపొర్లుతూ, శీతాకాలంలో ఆనకట్టపై నీరు జాలు వారుతూ దుమ్ముగూడెం ఆనకట్ట తన అందాలతో ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యాన ఆనకట్ట ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడంపై పాలకులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యాటకులకు దారి కష్టాలు


గులకరాళ్లు తేలిన రహదారి

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన మండలంలోని కిన్నెరసానిలో నిర్మించిన అద్దాలమేడ, కాటేజీలకు వెళ్లాలంటే దారి కష్టాలు ఎదురవుతున్నాయి. బోటింగ్ పాయింట్ నుంచి 1,200 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించినా ఆ తర్వాత 800 మీటర్లు కంకర తేలి ఉంది. దీంతో అధికారులు స్పందించి రోడ్డు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. అలాగే, కిన్నెరసాని అభయారణ్యాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు వైల్డ్‌లైఫ్ శాఖ కృషిచేస్తుంటే మరోవైపు టూరిజం అధికారులు అద్దాలమేడ, కాటేజీల నుంచి డ్రెయిన్ నీరు బయటకు వెళ్లేందుకు ప్లాస్టిక్ పైపులతో కాల్వ నిర్మించడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై టూరిజం కార్పొరేషన్ డీఈ రవీందర్‌ను వివరణ కోరగా సీపీవీసీ పైపులే పటిష్టంగా ఉంటాయని.. ఇప్పుడు అంతా వీటినే వినియోగిస్తున్నారని తెలిపారు. ఇక కిన్నెరసానిని వీక్షించేందుకు పర్యాటకులు వస్తుండగా టికెట్ రుసుం వసూలు చేస్తున్న అధికారులు కొన్నాళ్లుగా ప్రాజెక్టు డ్యామ్‌పైకి వెళ్లనివ్వడం లేదు. దీంతో నిరాశతో వెనుదిరుగుతున్నామని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిన్నెరసానికి కొత్త బోటు...

- నేడు ప్రారంభించనున్న మంత్రి
- పాత బోటుపైనా దృష్టి సారించాలని విన్నపాలు


కొత్త బోటును సిద్ధం చేస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌లో పర్యాటకుల సౌకర్యార్థం మరో బోటు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే 50 మంది సామర్థ్యం కలిగిన పెద్దబోటుతో పాటు నలుగురు ప్రయాణించే చిన్న స్పీడ్‌బోట్ ఉన్నాయి. అయితే, పర్యాటకుల రద్దీ దృష్ట్యా 20 మంది సామర్థ్యం కలిగిన మరో బోట్‌ను టూరిజం డెవలప్‌మెంట్ శాఖ అధికారులు కేటాయించారు. ఈ బోట్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ప్రారంభించనున్నారు. కాగా, కిన్నెరసానికి సోమవారం మంత్రులు రానున్న నేపథ్యాన పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, ఎస్సై సురేష్ ఆదివారం బోటింగ్ పాయింట్, అద్దాలమేడ, కాటేజీల ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించారు.

'బాహుబలి'పై నిర్లక్ష్యం

ఎనిమిదేళ్ల కిందట రూ.లక్షల వ్యయంతో తీసుకొచ్చి న బాహుబలి బోటు నిర్లక్ష్యానికి గురైంది. తెలంగా ణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన పుణే నుంచి రూ.40 లక్షల వ్యయంతో వంద మంది సీటింగ్ సామర్థ్యం కలిగిన బోటును 2015లో తెప్పించారు. అయితే, రిజర్వాయర్‌లో తిప్పకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో అది పనికిరాకుండా పోయింది. ఫైబర్‌షీట్లు లేచిపోయి రాడ్లు పైకి తేలాయి. ఈ బోటును సైతం అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై టూరిజం డెవలప్‌మెంట్ శాఖ మేనేజర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. పర్యాటకుల రద్దీ దృష్ట్యా కొత్త బోటును స్టాండ్‌బైగా తీసుకొస్తున్నామని తెలిపారు. అయితే, బాహుబలి బోటు వచ్చినప్పుడు తాను లేనని.. ఆ వివరాలు తెలియవని చెప్పారు.

'గంజాయి' శిక్షలు కఠినంగా ఉంటాయి..

- డీఎస్పీ చంద్రభాను
- డిగ్రీ కళాశాల సమీపంలో 53 కిలోల గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: ఎవరిపైనైనా గంజాయి కేసు నమోదైతే నూతన చట్టాలతో శిక్షలు కఠినంగా ఉంటాయని డీఎస్పీ ఎస్.చంద్రభాను హెచ్చరించారు. స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలో 53 కేజీల గంజాయిని పట్టుకోగా.. ఆదివారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఇల్లెందు – కొత్తగూడెం రోడ్‌లో డిగ్రీ కళాశాల వద్ద ఎస్‌ఐ సూర్య ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఉత్తరాఖండ్‌కు చెందిన తూపాన్ (వినోద్), లలిత్ మోహన్ నేగీ (డ్రైవర్), ప్రేమ్‌వీర్ సింగ్, రాజ్‌కుమార్, అమ్రిత్‌పాల్ కారులో 53 కేజీల గంజాయి తరలిస్తూ దొరికారు. ఈ క్రమంలో తూపాన్ అక్కడి నుంచి పరారు కాగా మిగిలినవారిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలోని బెదబ్యాస్‌నాయక్ వద్ద గంజాయి కొనుగోలు చేసి ఉత్తరాఖండ్‌లోని దీపక్, విశాల్ వద్దకు తరలిస్తున్నట్లు అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ.13.25 లక్షలు ఉంటుందని, నిందితుల వద్ద నుంచి మూడు మొబైళ్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని డీఎస్పీ వివరించారు. సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్‌ఐ సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.

155 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ట్రాక్టర్‌లో తరలిస్తున్న గంజాయిని శనివారం భద్రాచలం ఎక్సైజ్ శాఖ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య వివరాలు వెల్లడించారు. నిందితుడు ట్రాక్టర్ ట్రక్కును ఖాళీగా ఉంచి, కింది భాగంలో గంజాయి అమర్చి రవాణా చేసేందుకు యత్నించాడన్నారు. ట్రాక్టర్‌లో సుమారు 155 కేజీల ఎండు గంజాయి ఉందని, దాని విలువ రూ.38 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 41 కేసులు నమోదు చేసి, 82 మంది నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 53 మొబైళ్లు, 36 వాహనాలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామని తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేస్తామని జానయ్య వివరించారు. కార్యక్రమంలో కరంచంద్, రహీమున్నీసా, సీతారామరాజు, అలీమ్, వీరబాబు, నాగేశ్వరరావు, లలిత, మనోహర్, జమాల్, వెంకట్ పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్


నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పినపాక: ద్విచక్రవాహనంపై గుడుంబా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ రాజిరెడ్డి కథనం ప్రకారం..బయ్యారం క్రాస్ రోడ్‌లో వాహన తనిఖీలు చేపట్టగా టేకులగూడెం గొత్తికోయగుంపునకు చెందిన అడవయ్య, బుద్ర ద్విచక్ర వాహనంపై గుడుంబాను తరలిస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

కార్గో సర్వీస్‌లో గుట్కాలు

ఇల్లెందు: ఇల్లెందు ఆర్టీసీ కార్గో సర్వీస్‌లో గుట్కా ప్యాకెట్లు లభించాయి. ఆదివారం ఇల్లెందు కార్గో సర్వీస్‌లో ఓ గోనె సంచి రాగా దానిని తెరిచి చూడగా 160 బాక్సుల గుట్కా ప్యాకెట్లు ఉన్నాయి. వాటి విలువ సుమారు రూ.96 వేలు ఉంటుందని సీఐ సత్యనారాయణ వెల్లడించారు. పట్టణానికి చెందిన గుట్కా వ్యాపారి శంకర్ సాహూకు చెందిన సరుకుగా నిర్ధారణ అయిందని, ఆయనపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

యాదవుల అభ్యున్నతికి సమష్టి కృషి


మాట్లాడుతున్న కూరాకుల నాగభూషణం, పక్కన నాయకులు

ఇల్లెందు: స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ యాదవులు సహా కొన్ని జాతులు, కులాలు అట్టడుగున ఉన్న నేపథ్యాన ఆయా కులాల అభ్యున్నతికి సమష్టి కృషి జరగాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం అన్నారు. ఇల్లెందులో పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యాన ఆదివారం జరిగిన చైతన్య సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు రాజకీయాలల్లో సముచిత స్థానం లభించటం లేదన్నారు. ఇకనైనా అన్ని పార్టీలు అజెండాల్లో యాదవులకు పదవులు కల్పించేలా ప్రకటించాలని కోరారు. ఇల్లెందులో యాదవులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థానిక నేతలు కృషి చేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు నాగా సీతారాములు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పగడాల నాగరాజు, మెట్టెల కృష్ణ, పెద్దబోయిన ఉమాశంకర్, మేకల మల్లేశ్‌యాదవ్, సుంకరబోయిన సత్యనారాయణ, బయ్యా వరప్రసాద్, జడల వాణి, రేఖా రవిశంకర్, కోడి రాజేందర్, నాయిని సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో డీఎఫ్‌ఓ పూజలు


పూజ చేస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్

ఏన్కూరు: మండలంలోని నాచారం శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయం, గార్లొడ్డులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ ఆదివారం సందర్శించారు. కుటుంబీకులతో సహా వచ్చిన ఆయన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వాగతం పలికి పూజల అనంతరం ఆయనను సత్కరించారు.

అదృశ్యమైన యువతి విగతజీవిగా..


పల్లపు శిరీష (ఫైల్)

పాల్వంచరూరల్: రెండు రోజుల కిందట మేకలు కాసేందుకు వెళ్లి కనిపించకుండా పోయిన యువతి కాలువలో విగతజీవిగా లభించింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉల్వనూరు గ్రామానికి చెందిన పల్లపు నర్సింహారావు, ఎల్లమ్మ కుమార్తె శిరీష (19) మేకలు కాసేందుకు శుక్రవారం వెళ్లి కనిపించకుండా పోయింది. శిరీష తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఆదివారం అటవీ ప్రాంతంలో గాలిస్తుండగా రాళ్లవాగులో శిరీష శవమై కనిపించింది. ఎస్‌ఐ సురేశ్ ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శిరీష మేకలను కాసేక్రమంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటుందని భావిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నా బిడ్డ సూచనతోనే సేవా కార్యక్రమాలు

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి


ఎమ్మెల్యే రాగమయికి కేక్ తినిపిస్తున్న కుమార్తెలు విపంచి, విరాజి

సత్తుపల్లి: భగవంతుడు తన కుమార్తె ఆషాను తీసుకెళ్లినట్లు కుమిలి కుమిలి ఏడ్చినా ఆ బిడ్డ చెప్పిన చివరి మాటే స్ఫూర్తిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని.. ఆమె ఆశీర్వాద బలంతోనే పదవి వచ్చిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడించారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో తన భర్త డాక్టర్ దయానంద్‌తో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మాగమయి మాట్లాడుతూ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు తమ వెంట ఉండి తన గెలుపులో కీలకంగా వ్యవహరించారంటూ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, మంచి చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి తమ కుటుంబంపై కొందరు చేస్తున్న విమర్శలను అంతా ఖండించాలని కోరారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.25 లక్షలు సంక్షేమ నిధికి ఇస్తామన్న హామీ మేరకు తొలి విడతగా ఎమ్మెల్యే వేతనం నుంచి రూ.5లక్షల చెక్కును రాగమయి– దయానంద్ దంపతులు అందజేశారు. మార్కెట్ చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, నీరజాదేవి, నాయకులు చల్ల గుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, తోట సుజలరాణి, శివవేణు, దూదిపాల రాంబాబు, నారాయణవరపు శ్రీనివాసరావు, అలవాల కరుణాకర్, చల్లారి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి

అశ్వారావుపేటరూరల్: ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా మారేడుబాకకు చెందిన ఘంటసాల శ్రీను (42), వంట మేస్త్రి చింతం రమణతో కలిసి బైక్‌పై అశ్వారావుపేట మండలం వినాయకపురం సమీపాన శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద ఓ శుభకార్యంలో వంట చేసేందుకు వచ్చారు. పనులు పూర్తయ్యాక తిరిగి స్వస్థలానికి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీను బైక్‌పై నుంచి కింద పడగానే ఆయన పైనుంచి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఇదే ఘటనలో రమణకు తీవ్ర గాయాలవగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిని ఎస్‌ఐ శివరామకృష్ణ సందర్శించి కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతి చెందిన శ్రీనుకు భార్య మల్లేశ్వరి, ఇద్దరు కుమారులున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు...


సాయిశ్యామ్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు సేవించిన యువకుడు చికిత్స పొందే క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని చిన్నంశెట్టి బజార్‌కు చెందిన బూదూరు సాయిశ్యామ్ (20)ను తల్లిదండ్రులు ఓ విషయంపై సున్నితంగా మందలించగా, మూడు రోజుల కిందట పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సాయిశ్యామ్ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎలాంటి ఫిర్యాదు రాలేదని స్థానిక ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన ధరావత్ ఓంప్రకాశ్‌కు తన భార్య రమాదేవికి మధ్య కొంతకాలంగా మనస్పర్ధలు ఉన్నాయి. ఓ పత్రిక విలేకరిగా పనిచేస్తున్న రమాదేవి బావ నగేశ్.. ఓంప్రకాష్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కొట్టించడంతోపాటు బెదిరింపులకు పాల్పడుతుండటంతో మనస్తాపం చెందాడు. ఆదివారం ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి యత్నించగా కుటుంబ సభ్యులు గుర్తించి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సురేశ్‌ను వివరణ కోరగా.. ఆత్మహత్యాయత్నం విషయం తమ దృష్టికి రాలేదని, భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు చేసిందని తెలిపారు.